# మిత్రద్రోహం



“అడుగో నీ శేఖర్!” అటు తిరిగి ఉన్న ఇందిరను ఉద్దేశించి పరిహాసంగా అన్నది నిర్మల.

ఇందిర ఉలిక్కిపడి గుమ్మంవైపు చూసింది. నిర్మల పకపకా నవ్వేసింది. ఇందిర సిగ్గుపడుతూ తల దించివేసుకుంది.

“ఇది నీ ఇల్లు కాదే నీ శేఖర్ సరాసరి లోనికి వచ్చేందుకు! ఇది కాలేజ్ హాస్టల్! తెలిసిందా? ఊఁ... అమ్మయినా దయతలిచి, అతన్ని లోపలకు వదలవచ్చేమో కాని, ఇక్కడ మమ్మల్ని కాపాడుతున్న అమ్మ, అమ్మలగన్నయమ్మ, అందరికన్న పెద్దమ్మ; వార్డెనమ్మ, ప్రాణం పోతున్నా మగపురుగుని లోనికి రానివ్వదు, తెలుసా? ఏం మాట్లాడినా అయిదు నిమిషాల వ్యవధిలో ఆమె సమక్షంలోనే మాట్లాడాలి. తెలిసిందా?” నవ్వుతూ ఉపోద్ఘాతం ఇచ్చింది నిర్మల.

అంతటినీ కలుషితం చేసే శక్తి స్వార్థానికి ఉంది. ఎంతటి అకార్యమైనా చేయించ గలదు అయితే పశ్చాత్తాపం అన్నిటినీ కడిగివేసి, మనిషికి నిర్మలత్వం ప్రసాదిస్తుంది. ఇదంతా ఒక ఎత్తు. స్వార్థపూరితుడైన మనిషి అఘాయిత్యాలకు గురి అయి ఎందుకూ కొరగాకుండా పోయే వారి గతి మరొక ఎత్తును.

ఆమె ఉపోద్ఘాతం ముగియటంతో, ఇందిర తలెత్తి చూసింది. ఆమె చూపుల్లో సంతోషం స్థానే ఆశ్చర్యం ఉద్భవించింది. ఆ ఆశ్చర్యంలో ఆమెకు అంతవరకు ఆ విషయమే తెలియదన్న సత్యం దాగి ఉంది. ఆమె పరిస్థితికి నిర్మల మెల్లిగా నవ్వింది. ఆమె నవ్వుతో ఇందిర తిరిగి సిగ్గుపడిపోయింది.

'పిచ్చిది!' అనుకుంది నిర్మల.

నిర్మల, తన చూపు తిరిగి ఆమెమీదికి పోనిచ్చింది. ముందున్న పుస్తకంలోని పేజీలను పిసుకుతున్న వేళ్లతో త్రిప్పుతూంది. ఆమె మనస్సంతా శేఖర్‌మీద కేంద్రీకృతమై ఉన్నదని గ్రహించింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు మాత్రం క్షణక్షణానికీ విచ్చుతూఉంది.

నిర్మల ఆలోచనలో పడింది. ఇందిర పెద్ద అందగత్తేమీ కాదు. అందులోనూ నలుపు. అటువంటి దాని హృదయాన్ని చూరగొన్నవాడు ఎంతటి అందగాడై ఉండాలి? బహుశా అతనూ ఈమెకు అందంలో సరిపోయేవాడే అయి ఉండవచ్చు! లేకపోతే ఈమెను ప్రేమించినవాడు అందగాడు ఎలా అవుతాడు? రాజు మెచ్చిందే రంభ! అయినా అతను ఎటువంటివాడయినా ఇందిర పవిత్రత కోసం మాత్రం పూజ చేసుకొని పుట్టి ఉంటాడు!

"ఇందిరమ్మగారూ! ఎవరో శేఖర్‌గారట! మిమ్మల్ని చూడడానికి వార్డెనమ్మగారి గదిలో ఉన్నారు. వార్డెనమ్మగారు మిమ్మల్ని రమ్మన్నారు." ప్యూను చెప్పిన మాటలు వినగానే ఆలోచనలోనుండి ఉలిక్కిపడి తేరుకుంది నిర్మల.

ప్యూను వెళ్ళిపోయాడు. నిర్మల ఇందిర వైపు చూసింది. ఆమెలో ఉప్పొంగిన సంతోషం అవతరించటంతో, వదనంలో పొంగి పొరలబోతున్న సిగ్గు కప్పిపుచ్చుకోయింది. కాని, అది అవధులు దాటిపోయింది. వెంటనే పైట కొంగుతో సిగ్గుతో నిండిన వదనాన్ని గబుక్కున కప్పేసుకుంది.

ఆమె ప్రవర్తనకు నిర్మల మరొకసారి నవ్వుకుంది. అంద విహీనులకుకూడా సిగ్గు ఉంటుంది కాబోలు! ఆమెకు తెలియని విషయాన్ని కళ్ళారా చూస్తూంది.

"త్వరగా వెళ్ళిరా... తరవాత సిగ్గుపడుదువుగాని." ముందుకు నెట్టింది ఇందిరను నిర్మల.

"నువ్వూ రావే." ఇందిర కంఠం వణికింది.

"నేనా? ఎందుకూ?"

"నాకెందుకో భయంగా ఉందే."

"నీ శేఖరేగా!" ఎగతాళి చేసింది.

"అబ్బ! ఊరుకోవే, వార్డెను వింటుంది. ప్లీజ్." ప్రాధేయపడింది ఇందిర.

ఇందిర తొట్రుపాటును ఉద్దేశించి, "ఇప్పుడు వార్డెనుముందు మాట్లాడలేనిదానివి, రేపు అందరి ముందూ మూడుముళ్ళు ఎలావేయించుకుంటావే?" అని పరిహాసం చేసింది నిర్మల.

"అయితే నే పోను." మరింత సిగ్గుపడుతూ అంది ఇందిర.

"ఆఁ ఆఁ నీ శేఖర్ మద్రాసునుండి వచ్చాడు, పాపం! దర్శనం ఇవ్వకపోతే, భక్తుడు బాధపడతాడు. ఊఁ. పదు." ఇందిర సిగ్గుతో కొట్టబోయిన లెంపకాయ తప్పించుకుని ముందుకు నడిచింది నిర్మల. తడబడుతున్న అడుగులతో ఆమెను అనుసరించింది ఇందిర.

గబగబ అడుగులు వేస్తున్ననిర్మల వార్డెను గదిముందు టక్కున ఆగిపోయింది. తడబడుతూ అడుగులు వేస్తున్న ఇందిర ఆమెమీద పడబోయి నిలదొక్కుకుంది. వీళ్ళిద్దరినీ చూసిన ప్యూను లోనికి వెళ్ళివచ్చాడు.

"రమ్మన్నారు" అన్నాడు ప్యూను.

"వెళ్ళవే." మెల్లిగా అంది నిర్మల.

"నువ్వూ రావే." కీచు గొంతుకతో అంది ఇందిర.

"అబ్బ! నీతో ఎప్పుడూ ఇంతే! ఊఁ పద." గొణిగింది నిర్మల.

నిర్మల మెల్లిగా గదిలో అడుగుపెట్టింది. ఎదురుగా ఉన్న కుర్చీలో వార్డెను కూర్చొని ఉంది. గుమ్మానికి వీపు చూపిస్తూ ఎవరో యువకుడు ఆసీనుడై ఉన్నాడు. నిర్మల వార్డెనుకు నమస్కారం చేసింది. ఆమె ప్రతి నమస్కారం చేస్తూ, ఆశ్చర్యంగా చూసింది. కాని, అంతలోనే వెనక నక్కిఉన్న ఇందిర సిగ్గుపడుతూ నమస్కరించటంతో ఆమె ఆశ్చర్యాంబుధినుండి తేరుకుంది. ఆమె ఆశ్చర్యంలోని అంతరార్థం అప్పటికి అర్థమయింది నిర్మలకు.

"రా, ఇందిరా. రా." ఆప్యాయంగా పిలిచింది వార్డెను.

ఇందిర మంచి తెలివిగలది. అందుచేత వార్డెనుకు ఆమెమీద ప్రత్యేకాభిమానం.

ఇందిర పేరు వినటంతో, అతను వెనక్కు తిరిగి చూశాడు. నిర్మల ఒక్కసారి అదిరిపడింది. ఎంత అందంగా ఉన్నాడు! ఆమె ఊహించని అందం! ఎవ్వరికీ లభించని అందం! ఇందిరకన్న కొన్నిరెట్లు మించిన అందం! నిర్మల స్తంభించిపోయింది.

ఇందిర తడబడుతూ ముందుకు కదిలింది. ఆమె ప్రవర్తన గమనించిన వార్డెను నవ్వుతూ బయటకు నడిచింది. పోతూ పోతూ నిర్మలను చూసి, అదో మాదిరిగా నవ్వింది. ఆ నవ్వులోని అంతరార్థం ఆమె గ్రహించింది. మరి నీకు హృదయేశుడు లేడా అని పరిహాసించటం!

"బాగున్నావా, ఇందిరా?" నిశ్చలమైన కంఠంతో ప్రశ్నించాడు శేఖర్.

"ఊఁ" సిగ్గుతో నిండి ఉన్న ఆమె వదనాన్ని అతని పాదాలవైపు కేంద్రీకరించి చూస్తూ అన్నది ఇందిర.

"ఏమిటా సిగ్గు?" నవ్వుతూ అని, నిర్మలవైపు చూసి, "అన్నట్లు ఈమె నీ ఫ్రెండ్ నిర్మల కదూ?" ప్రశ్నించాడు శేఖర్.

"అవును. జాబులో పరిచయం చేసింది ఈమెనే." సిగ్గు దొంతరలను పారద్రోలుతూ, తలెత్తి జవాబిచ్చింది ఇందిర.

## వ్యాసచంద్

"నమస్తే!" ప్రశాంతంగా అని, చేతులు జోడించాడు శేఖర్.

"నమస్తే!" తొట్రుపాటుతో ప్రతినమస్కారం చేసింది నిర్మల.

"పరీక్షలుదగ్గిరికి వస్తున్నాయి కదూ? బాగా చదువుతున్నారా?" పరామర్శించాడు.

"ఊఁ." ఇద్దరూ తలలూపారు.

"చూడండి, నిర్మలగారూ! ఇందిరను కాస్త జాగ్రత్తగా చూసుకోండి. లేకపోతే, నిద్రలోనైనా ఈ విశాఖపట్నంనుండి మద్రాసుకు నడిచి వచ్చేస్తుంది." చమత్కారంగా అన్నాడు.

నిర్మలకు మాట్లాడేందుకు సమయం దొరికింది. ఇందిరవైపు చూసింది. సిగ్గుతో నిండిన కొరకొర చూపులు ఆమె నేత్రాల్లో ప్రస్ఫుటమౌతున్నాయి.

"అందుకే ఈ మధ్య నేను తన బెడ్‌లో పడుకొని, ఎటూ కదలనివ్వకుండా బంధించి ఉంచుతున్నాను." నవ్వుతూ అంది.

ఆమె నవ్వుతో నవ్వు కలిపాడు శేఖరం. వారిరువురి హేళనకు ఇందిర ఖంగుమూతి పెట్టింది. ఇద్దరినీ చురచురా చూసింది.

"ఆఁ, ఇక రాణీగారు కోపావేశాలు దాటిపోతున్నారు. ఊరుకోండి" అని బల్లమీద ఉన్న ఒక పాకెట్ ఇందిర చేతిలో ఉంచి, "కనికరించండి" అని ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

ఇందిర దాన్ని అందుకొని, నవ్వేసింది. వెంటనే మరొక చిన్న పాకెట్ నిర్మల చేతిలో పెట్టాడు. వద్దు అనుకుంటూనే స్వీకరించింది. దాన్ని స్వీకరిస్తున్న సమయంలో అతని మునివేళ్ళు ఆమె చేతికి తగిలాయి. వెంటనే ఆమె అనిర్వచనీయమైన అనుభూతికి లోనయింది. అతని నేత్రాల్లోకి చూసింది. ప్రశాంతంగా నవ్వుతున్నాయి. ఆ నవ్వులో కల్మషం లేదు!

"తిరిగి తమరి దర్శనం ఊళ్లోనేగా?" ఇందిరవైపు చూసి ప్రశ్నించాడు శేఖర్.

ఆమె అంగీకారార్థకంగా నవ్వింది. ఆమె నిశ్చల మందస్మిత మధుర వదనాన్ని తిలకిస్తూ, అతను ఆనందానుభూతులలోకంలో విహరించటం నిర్మల గ్రహించింది. వారిరువురూ మూగసైగలు వల్లెవేసుకుంటూ రెండు క్షణాలు తమ తమవులు మరిచారు. ఆ సమయంలో నిర్మల హృదయాంతరాళంలో ఊహించని బాధ ఉద్భవించింది. ఎందుకో ఆమెకే తెలియదు.

అంతలోనే వార్డెను లోనికి ప్రవేశించింది. వారిరువురూ మామూలు పరిస్థితిలోకి వచ్చేందుకు ఒక్క క్షణకాలం పట్టింది. ఆమె ఇందిరను చూసి మామూలుగా నవ్వి, నిర్మలవైపు అదో మాదిరి చూసింది. ఈసారి నిర్మల శరీరంమీద తేళ్ళూ, పాములూ పాకినట్లయింది. ఆమెను మనస్సులోనే తిట్టుకుంది.

"థాంక్స్, శేఖర్." ఇందిర సిగ్గంతా ఒలకబోస్తూ, మెల్లిగా అంది.

"అలాగే." అల ఊపాడు

ఇందిర వెనక్కు మరలింది. తనూ ఆఖరిసారిగా పలకరించబోయింది నిర్మల. అప్పటికే వాళ్ళెనువైపు తిరిగి పోయాడతను. అనంత ప్తితో కూడిన మౌనంతో ఇందిరను అనుసరించింది.

ఇద్దరూ తమ గదిలో ప్రవేశించిన తరవాత వారివారి బహుమతులేమిటో చూసుకొన్నారు. ఇందిర పాకెట్‌లో నాలుగు చీరెలూ, నాలుగు జాకెట్ పీసెస్, కొంత టాయిలెట్ సామానూ ఉన్నాయి. నిర్మల పాకెట్‌లో ఒక చీరె, ఒక జాకెట్‌పీసు ఉన్నాయి.

నిర్మల మనస్సు క్రమంగా మారిపోసాగింది. అతని బింబాన్ని తన నేత్రాల ముందు ఉంచుకొని, మనస్సులో ఆ అందాన్ని ఆనందించసాగింది. ఇందిర సంపాదించినా అన్నమాటకు అయి జవాబివ్వింది.' కాని, ఆమె అను మానిస్తే అసహ్యించుకుంటుంది కనక మెల్లిగా తేరుకుంది.

ఆ రాత్రి నిర్మల మనస్సంతా ఆలోచనల సంఘర్షణతో నిండిపోయింది. నిద్ర పట్టలేదు. తెల్లవారి కావస్తుంది. దాని వెలుగులో ప్రశాంత వదనంతో నిద్రిస్తున్న ఇందిర విశాలమైన పెదవులమీద చిరునవ్వు చూసి అసహ్యించుకుంది. అంతటి కురూపికి అంతటి అందగాడైన వ్యక్తి భర్త కాబోతున్నందుకు అసూయ చెందింది. కాని, 'అతను తన ఆరాధ్య దైవంగా వారితే ఎంత బావుణ్ణు!' అన్న ఆశ, వికలమై పోతున్న ఆమె హృదయంలో జనించటంతో ఆనందించింది. అయితే వెంటనే బాధపడిపోయింది. కారణం అది జరగని కార్యం. జరగని ఆశలతో గాయపడుతున్న ఆమె మనస్తత్వం బాధకు గురి అవుతోంది. ఆలోచనలు దూరంగా నెట్టివేసి, నిద్రలోకి జారిపోయింది.

పరీక్షలు పూర్తి అయ్యే అంతవరకూ అనంతప్తి ఆమెను బాధిస్తూనే ఉంది. కాని, ఆఖరు రోజున ఇందిర పుస్తకంలోనించి దొంగిలించిన శేఖర్ ఫోటో తన దగ్గర కావటంతో నిర్మల మనస్సు కొంచెం స్థిమితపడింది. అదొక ప్రత్యేకించి అతని చిరునామా కూడా సంపాదించింది.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తావో! ఉత్తరాలు వ్రాస్తూ ఉండవే." రైలు దిగిపోతూ అంది ఇందిర.

"అలాగే! నువ్వే మరిచిపోతావేమో! పెళ్ళి అయిందంటే ఇక నీ ఆటకు అంతు ఉండదేమో!" మాట వరుసకు పరాచికాలాడింది నిర్మల.

"పోవే!" సిగ్గుపడిపోతూ అంది ఇందిర.

రైలు ముందుకు కదిలింది. నిర్మల లయాప్రమంగా చెయ్యి ఊపింది. నిమిషంలో ఇందిర కనుమరుగైపోయింది. ఆదే నిమిషంలో ఆమె మనస్సునుండి ఇందిర రూపం పూర్తిగా మాసిపోయింది. అంతా తాత్కాలికస్నేహంగా మారిపోయింది. ఇప్పుడు ఎదటి ఆడదాని ఆనందం ఓర్వలేని సాటిదానిలా తయారయింది నిర్మల!

• • •

సిగ్గు దొంతరలు పూర్తిగా ఆవరించటంతో ముందుకు అడుగు వెయ్యలేకపోయింది నిర్మల. కాని, వెనక ఉన్న ఆడంగులు బలవంతంగా ఆమెను గదిలోకి నెట్టారు. వెంటనే తలుపు దభాలున మూసుకుంది. ఆ తరవాత కిలకిలలూ పకపకలూ వినిపించాయి.

ఆమె మెల్లిగా తలెత్తి చూసింది. పుష్పగుచ్ఛాలతో

# మిత్రద్రోహం

అలంకరించబడి ఉంది శోభనపు శయ్య. దానికి ఇరువైపులా నానారకాల ఫలాలు తినుబండారాలు పళ్ళెరాలలో అమర్చబడి ఉన్నాయి. ఆ పక్కనే ఉన్న అగరువత్తుల ధూపం గది అంతా ఆక్రమించుకుంటూంది. దాని పరిమళంలో కొత్త ఉద్రేకాలు రేకెత్తుతున్నాయి.

ఇంకా కొంచెం ముందుకు పోయింది ఆమె. తన దూపు ఆనే గుమ్మం దగ్గర కుర్చీలో కూర్చొని ఏవో పుస్తకం పఠనం చేస్తున్నాడతను. ఆమె ప్రవేశించిన విషయం కూడా అతను తెలుసుకోలేని స్థితిలో ఉన్నాడు. అతని పరధ్యానానికి

రేఖ



నిర్మల నవ్వుకుంది.

ఆమె మెల్లిగా ముందుకు కదిలింది. పాదాలు సిగ్గుతో తడబడుతున్నాయి. దానికి తగినట్లుగా కాలి అందెలు జంకుగా తాళం వేస్తున్నాయి. అతనికి చేరువలో ఉన్న తలుపు దగ్గరికి పోయి, దాన్ని ఆనుకొని నిలుచుంది. ఆయనమాత్రం పరధ్యానంగానే ఉన్నాడు.

ఆమె మరోసారి నవ్వుకుంది. తన రాక తెలియజేస్తూ చిన్న పొడిదగ్గు దగ్గింది. అతను ఒక్కసారి ఆమె వైపు తిరిగి నిర్లక్ష్యంగా చూసి, మళ్ళీ అటు తిరిగిపోయాడు. ఆ దృశ్యాన్ని చూసిన ఆమె గుండె దడదడలాడింది. పూర్తిగా అవమానించబడినట్లయింది. పాదాలకింద భూమి కిందికి జారిపోతున్నట్లయింది. ఆ శోభనపుగదిలోని ప్రతి అణువూ పరిహసిస్తున్నది! అగరువత్తుల ధూపం అసహ్యించుకుంటూ, ఆమెను తప్పుకుపోతూంది. నిట్టూర్పులను చూడలేక గట్టిగా కళ్ళు మూసుకొని కింద పడిపోకుండా తలుపు పట్టుకొని ఆనుకుంది.

కొద్ది క్షణాలు గడిచాయి. అతను కుర్చీలోనుండి లేచినట్లు చప్పుడయింది. ఆమె కళ్ళు తెరిచి ఆత్రంగా చూసింది. అతను పలకరించకుండా ముందుకు పోబోయాడు. ఆమె నయనాల నుంచి అశ్రువులు జలజలా రాలాయి. అతను ఆగిపోయాడు. తీక్షణంగా ఆమె వదనంలోకి చూశాడు. అతని నేత్రాలు నిప్పులు చెరుగుతున్నాయి. వాటి ధాటికి తట్టుకోలేక తలవంచి దించి వేసుకుంది.

"హూఁ. నీ పగ చల్లారిందా?" ప్రశాంతంగా అన్నాడు శేఖర్.

కాని ఆ మాటల మధ్య ఎంతటి ఘోరమైన ఆగాధం ఉందో నిర్మలకు తెలుసు. మెల్లిగా తలెత్తి లజ్జాభారంతో అతన్ని చూసింది.

"నువ్వు నన్ను చూసి ఆశ్చర్యపోయిననాడే నాకు అనుమానం కలిగింది. నిన్నొక కంట కనిపెట్టమని ఇందిరకు వ్రాద్దామనుకున్నాను. కాని, ఇందిర నీలాటి మూర్ఖురాలు కాదు. ఏది జరిగినా దైవనిర్ణయం అంటుంది! అందుకే వ్రాయలేదు. కానీ నీకు భర్తను సునాయాసంగా కొనగలిగే శక్తి ఉంది. మిత్రద్రోహం చేసి నన్ను కొన్నావు. మావాళ్ళ దాహాన్ని నీ ధనంతో చల్లార్చావు! మనిషినయితే కొనగలిగావు కాని, మనిషి అధీనంలో ఉన్న మనస్సు మాత్రం స్వాధీనం చేసుకోలేవు. డబ్బువిలువ తెలిసిన మూర్ఖులు మనస్సుల విలువ కూడా తెలుసుకోవటం మంచిది" అని, శేఖరం ముందుకు నడిచి, దూరంగా ఉన్న కిటికీలోంచి శూన్యంలోకి చూడసాగాడు.

నిర్మల మెల్లిగా కళ్ళు తెరిచింది. ఆమె ఆలోచనలు ఇందిరమీదికి పోయాయి. ఆమెకు నిజంగా మిత్రద్రోహం జరిగింది. ఆమె మనసారా ప్రేమించిన వ్యక్తిని, తండ్రిచేత బోలెడంత డబ్బు పోయించి కొనిపించింది. ఇందిరకు తీరని ద్రోహం చేసింది. దానికి తగిన ప్రతిఫలం తనకు భగవంతుడు చూపించాడు.

ఆనందానురాగాలతో, తొలి కోర్కెలతో గడపవలసిన శోభనపురాత్రి, నిర్మలకు శోకపూరితమైన రేయిగా మారిపోయింది. ఆమెలో కలిగిన మార్పుతో చిగురించిన ఆశలన్నీ అణగారిపోయాయి. పొంగి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ గట్టిగా కళ్ళు మూసుకుంది.

కాలం భారంగా దొర్లిపోతూంది. వలుగురిలో

ఇద్దరూ భార్యాభర్తలుగా చలామణీ అవుతున్నా, అతని దృష్టిలో మాత్రం నిర్మల పరమ శత్రువయింది. దినదినానికీ క్రమంగా అతనికి దూరమైపోయింది. ఆమె మూగబాధ ఎవ్వరికీ చెప్పుకోలేదు. ఒకటి రెండు సార్లు ఇందిరకు క్షమాపణగా ఉత్తరాలు వ్రాసింది. కాని, జవాబు రాలేదు. జవాబుకోరకు ఆశించిన తను లది రాకపోవటంతో మరింత బాధ పడింది. ఆ బాధ మిత్రద్రోహానికి సరిఅయిన శిక్షగా అనుభవించ సాగింది.

ఒకరోజు శేఖరం అకస్మాత్తుగా వచ్చి, ఆమెను మద్రాసుకు తీసుకు వెళ్ళిపోయాడు. నిర్మల కిమ్మన కుండా అతని వెంట వెళ్ళింది. అందరూ సంతోషంగా వీడ్కోలు ఇచ్చారు. కాని, ఆమె మనస్సు మాత్రం భయాందోళనలకు గురి అయింది.

మద్రాసు వెళ్ళిన నిర్మల జీవితం మరీ దుర్భరమయింది. శేఖరం ఆమెతో మాట్లాడటం పూర్తిగా మానివేశాడు. ఉదయం స్వంత కారులో ఆఫీసుకు వెళ్ళినవాడు రాత్రి భోజనం కూడా బయటే ముగించుకొని వస్తున్నాడు. వచ్చీ రాగానే ఏదో ఒక పుస్తకం చదువుతూ అలాగే నిద్ర పోతాడు. ఈలోపల ఆమె అవస్థ దేవుడికెరుక. చుట్టు పక్కల వాళ్ళంతా అరవవాళ్ళు. ఎవ్వరికీ తెలుగు రాదు. ఆఖరికి పనిమనిషికి కూడా తెలుగు రానందున ఆమె ఎవ్వరితోను మాట్లాడక పోవటంతో, దాదాపుగా మూగ అయింది. మిత్రద్రోహానికి అంతకన్న పెద్దశిక్ష లేదని తోచింది. ఈ శిక్ష తను అనుభవించవలసిందే. తన అవస్థ గ్రహించి అయినా ప్రపంచం మేలు కొంటుంది.

ఆమె అన్నపానాలు పూర్తిగా మానివేసింది. క్రమంగా ఆమె శరీరం శుష్కించ నారంభించింది. అప్పుడప్పుడు తల తిరిగి పడిపోవటం ప్రారంభమయింది. ఆమెకు తెలియకుండానే పిచ్చి పిచ్చిగా మాట్లాడటం అలవాటయి పోయింది.

"నిర్మలా! మీ ఊరు వెడతావా?" వివాహానంతరం సంవత్సరం తరవాత ప్రశ్నించాడు శేఖర్.

నిర్మల ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూసింది. లోతుకు పీక్కుపోతున్న ఆమె నేత్రాలు అతని స్వరూపాన్ని స్పష్టంగా కనిపించనీయటం లేదు. అతని ప్రశ్నకు జవాబు ఇచ్చేందుకు నోరు తెరిచింది. మాట పెగిలి రాలేదు. తన పరిస్థితికి తనే జాలి పడింది. ఆమె నేత్రాల నుండి జలజలమని అశ్రుధారలు జారాయి. వెళ్ళనన్నట్టుగా తల అడ్డంగా ఊపింది. అతను ఏమీ పట్టించుకోనట్టు వెళ్ళిపోయాడు.

భర్త అనురాగానికి దూరమైపోయిన భార్య జీవితం వ్యర్థం! అంతకన్న పెద్దశిక్ష మరొకటి లేదు. బిగ్గరగా ఏడ్చేందుకు శక్తిలేక హృదయాంతరాళంలోనే ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి కింద పడిపోయింది.

ముక్కుకు ఏదో వాసన తగిలేసరికి కళ్ళు తెరిచి చూసింది నిర్మల. ఎదురుగా ఎవరో లేడీ డాక్టరు కూర్చొని, పరీక్షిస్తూంది. ఆమె వెనకగా శేఖరం మౌని అయి నిలుచుని ఉన్నాడు. నిర్మల కళ్ళు తెరవటంతో, డాక్టరు అతనివైపు తిరిగి ఏదో సైగ చేసింది. అతను బయటికి నడిచాడు.

నిర్మల మైకంనుండి బాగా తేరుకుంది. కాని బలహీనత మాత్రం ఆమెను కుంగదీస్తూనే ఉంది. శేఖరం వేడివేడి పాల కప్పుతో లోనికి వచ్చి, దాన్ని టీపాయ్ మీద ఉంచి తిరిగి బయటకు వెళ్ళిపోయాడు. డాక్టరు ఆమెచేత మెల్లిగా పాలు తాగించింది. అవి త్రాగిన తరవాత శక్తి కొంచెం పుంజుకున్నట్టయింది నిర్మలకు.

"నేనొక మాట అడుగుతాను. నిజం చెబుతారా?" ఉన్నట్టుండి ప్రశ్నించింది డాక్టరు.

ఆశ్చర్యంగా ఆమెవైపు చూసింది నిర్మల.

"మీ భర్త అనురాగాన్ని మీరు పూర్తిగా పొందుతున్నారా?" ఊహించని ప్రశ్న వేసింది డాక్టరు.

నిర్మల మౌనంగా ఉండిపోయింది. ఆ ప్రశ్నకు తను జవాబు చెప్పలేదు. చెప్పదు! ఆమె నయనాలు బాధకు చిహ్నంగా అశ్రుపూరితాలయినాయి.

"నాకు తెలుసు! అందుకే మీకు ఫిట్స్ వస్తున్నాయి. భర్త అనురాగాన్ని సంపాదించే మార్గం కనిపెట్టాలి కాని ఆహారం మానివేయవచ్చా? అందులో మీకు ఫలించే దేముంది?"

"మిత్రద్రోహానికి శాంతి." మెల్లిగా అంది నిర్మల. ఆ మాటలు బయటకు వినిపించేంత శక్తితో పలకలేక పోయింది. అందువల్ల తనకు తానే వాటిని అప్పజెప్పుకున్నట్టయింది.

"పిచ్చిదానా! జాగ్రత్తగా మెలగటం నేర్చుకో." తన ధోరణిలో తాను చెప్పి, గది బయటకు నడిచింది డాక్టరు.

ఆమె దయకు నవ్వుకుంది నిర్మల. అంతలోనే ఆ డాక్టరు అవతల గదిలో పెద్దగా అరుస్తున్న చప్పుడయింది. ఆమెకు అర్థంకాక చెవులు రిక్కబెట్టింది. కాని, తనకు ధ్వని తప్ప వారి సంభాషణ స్పష్టంగా వినిపించలేదు. కొంతసేపటికి అదీ పూర్తిగా ఆగి పోయింది. నీరసంగా మూలిగి ఒత్తిగిలి పడుకుంది.

కొద్ది క్షణాలు గడిచాయి. అప్రయత్నంగా ఆమె దృష్టి గుమ్మంవైపు పోయింది. అక్కడ నిలుచుని ఉన్న శేఖరాన్ని చూసి ఆశ్చర్యపోయింది. అతను తన వైపే చూస్తున్నాడు. పవిత్రమైన అతని ముఖాన్ని చూడలేక తన చూపు వాల్చేసుకుంది. కాని, అతను లోనికి వస్తున్నట్టు అడుగుల చప్పుడు లీలగా వినిపించిందామెకు. కిందికి చూస్తూనే ఉండిపోయింది.

అతను మెల్లిగా వచ్చి ఆమె పక్కన ఆసీనుడయ్యాడు. తలెత్తి ఆశ్చర్యంగా చూసిందామె. అతని నయనాల్లో జాలి వర్షిస్తూంది. తనవంటి పాపి, అతన్ని ముట్టుకొనేందుకు అర్హురాలు కాదన్నట్టుగా దూరంగా జరగబోయిందామె.

"నిర్మలా!" ఆమె వదనాన్ని తన హస్తాలతో బంధిస్తూ అన్నాడు శేఖర్.

ఊహించని ఆ సంఘటనకు ఆశ్చర్యపోయింది నిర్మల. ఆమె నోటివెంట మాటలు పెగిలి రావటంలేదు.

"క్షమించు, నిర్మలా!" ఆమెను తన హృదయానికి హత్తుకున్నాడు.

అంతవరకు ఆశించని అతని శరీర స్పర్శతో ఆమె తనువు ఆనందంతో వణికింది. మాటలాడేందుకు ఆమె పెదవులు వణికాయి. ఆనందంతో పొంగుతున్న దుఃఖాన్ని అణుచుకుంటూ ఆమె శిరస్సు అతని బంధంలో దాచుకుంది. ఆమె శిరోజాలనూ, తనువునూ అతను మెల్లిగా నిమిరాడు. నశించిపోయిన శక్తి తిరిగీ ఆమెలో ప్రవేశిస్తున్నట్టయింది.

"ఏమండీ. . . ." శక్తి అంతా కూడగట్టుకొని



# తన్మయం

అంది నిర్మల.

అతని బంధంలో దాచుకున్న ఆమె వదనాన్ని హస్తాల్లోకి తీసుకొని, "నిర్మలా!" అన్నాడు శేఖరం.

ఆమె సిగ్గు పడిపోయింది. సిగ్గుతో ఉబ్బిపోతున్న ఆమె చెక్కిళ్ళమీద చిన్న చిటిక వేసి, బయటికి వెళ్ళిపోయాడు శేఖర్. నిర్మల, తనలో ఉద్భవిస్తున్న కోర్కెలను ఊహించుకుంటూ సిగ్గుతో తలగడలో ముఖాన్ని దాచుకుంది.

అంధకారంతో నిండిపోయిన ఆమె జీవితం తిరిగి వెలుగులో ప్రవేశించింది. హాయిగా ఆనందించసాగింది. క్రమంగా ఆహారాన్ని కూడా రుచిచూచే రోజులు వచ్చాయి. శేఖర్ ఆమెను అన్నివిధాలా ఆదరిస్తున్నాడు. ఎటువంటి లోపమూ రానివ్వక జాగ్రత్తగా చూస్తున్నాడు. అతన్ని దైవానికన్న మిన్నగా పూజించ సాగిందామె.

ఒకరోజు సాయంత్రం హడావిడిగా వచ్చి, "నిర్మలా!

త్వరగా తయారవ్వు" అని ప్రేరేపించాడు శేఖర్.

"ఏమిటండీ ఆ తొందర?" ఆయాసపడుతూ మెల్లిగా అంది.

"మంచి సినిమా వచ్చింది. టిక్కెట్లు బుక్ చేశాను. త్వరగా తయారు కావాలి!"

"అబ్బ! నేను అంతసేపు కూర్చోలేనండీ!" సిగ్గుపడుతూ అంది.

"ఇప్పుడు కాకపోతే రేపు ప్రసవించిన తరవాత కూర్చోగలవా? ఊఁ." ఆమెను బలవంతం చేశాడు.

అతని ఆదరాన్ని త్రోసిపుచ్చటం బాగుండనందున కాదనలేక కుర్చీలోనుండి లేచింది. గర్భంలోఉన్న తన సొమ్ముకు కష్టం కలగనివ్వకుండా డ్రెస్సింగ్ రూమ్ వైపు నడిచింది.పది నిమిషాల్లో తయారయి బయటకు వచ్చింది. ఆమెకొరకే ఎదురు చూస్తున్న శేఖరం ఆమెను దగ్గిరికి తీసుకొని చుంబించాడు. అతని కొంటె తనానికి నవ్వుతూ దూరంగా జరిగిపోయింది. అతనూ మెల్లిగా నవ్వి బయటికి దారి తీశాడు. పమిట కొంగుతో తన బుగ్గలు తుడుచుకుంటూ దాని అనుభూతికి ఆనందిస్తూ అతన్ని అనుసరించి కారులో కూర్చుంది. కారు వేగంగా ముందుకు దూసుకు పోనిచ్చాడు శేఖరం.

వారి కారు వరొంటు రోడ్డులో వేగంగా పరుగిడుతూంది. సినిమా ఆరంభించే సమయం కనక ఆవేగాన్ని తగ్గించకుండా చూస్తున్నాడు శేఖరం. ఆ వేగానికి నిర్మల కొంచెం భయపడింది. కాని, అతను కారు నడపడంలో మంచి అనుభవం కలవాడు కనక ఆమె నిమ్మళంగా కూర్చుంది.

శేఖరం లడే మెంలో మలుపు తిప్పి, థియేటరు లోనికి పోనివ్వబోయాడు. దురదృష్టవశాత్తు ఎవరో వ్యక్తి కారుకు అడ్డంగా రావటంతో బ్రేకు గట్టిగా తొక్కాడు. దానితో సరిగా పోతున్న కారు ఇటు వైపు పోయి, దభాలున దానికి గుద్దుకుంది. ముందున్న అద్దం భళ్ళున పగిలి ముక్కలయింది. అదాటుతో కూడిన భయంతో తిలకిస్తున్న నిర్మల నేత్రాల్లోకి సూదుల్లాటి రెండు గాజు పెంకులు గుచ్చుకు పోయాయి. అంతవరకూ భయంగా చూస్తున్న ఆమె నేత్రాలలో పూర్తిగా చీకటి ఆవరించింది. ఆ బాధ భరించలేక కెవ్వుమని కేకవేసి, స్పృహ కోల్పోయింది. ఆ సమయంలో నిర్మలకు తను భద్రంగా మోస్తున్న శిశువు వెలుపలకు వస్తున్న సూచనలు గోచరించాయి.

ఆమెకు మెలకువ వచ్చేసరికి అంతా గాఢాంధకారంగా ఉంది. కళ్ళు తెరిచి పరీక్షించ బోయింది. కాని, అవి తెరవడానికి వీలులేకుండా బంధించబడి ఉన్నాయి. ఆమెకు పరిస్థితి అవగాహనగాక చేతులతో తడిమింది. కట్టు కట్టి ఉంది. అప్పటికీ పరిస్థితి అర్థం కాలేదు. వెంటనే ఆమె హస్తాలు పొత్తి కడుపు మీదికి పోయాయి. అది నాభికి అంటుకుపోయి వుంది. ఆమెకు వెర్రి ఎత్తినట్లయింది. 'పాప ఎక్కడ?' అన్న ఆలోచనలు ఆమెను తలకిందులు చేశాయి. వెంటనే పైకి లేవబోయింది.

"ఆఁ ఆఁ పైకి లేవకూడదు!" ఎవరిదో స్త్రీ కంఠం ఆమెను వారించి, తిరిగి పడుకోబెట్టింది.

# మిత్రద్రోహం

"నేనెక్కడ ఉన్నాను?" ఆత్రంతో కూడిన ఆయోమయంతో ప్రశ్నించింది నిర్మల.

"జనరల్ హాస్పిటల్లో."

"ఆఁ!" ఆశ్చర్యపోయింది.

"ఆక్సిడెంటు తరవాత మిమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చాము."

అప్పటికి జరిగిన విషయం అంతా పూర్తిగా అర్థమయింది నిర్మలకు.

"వారు క్షేమంగా ఉన్నారా?" ప్రశ్నించింది.

"ఆఁ."

"మరి నా పాప?" ఆశలు పెంచుకోకుండా పొంగుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అడిగింది.

ఒక్క క్షణకాలం మౌనం! ఆ క్షణంలో నిర్మల మనస్సు అనేకవిధాల పరిభ్రమించింది.

"ఇదిగో నీ పాప!" నిర్మల పక్కన పరుండబెట్టిందామె.

"ఆఁ ఏదీ? నా పాప ఏదీ?" తడుముతూ ఆ పాపను తనదగ్గిరికి లాక్కుంది.

"ఆడపిల్ల. అచ్చం మీవారిలా ఉంది."

"ఆఁ!" అంటూ సంతోషంగా చూడబోయింది. కాని చూడలేకపోయింది. ఆమె కళ్ళకు గంతలు కట్టేసి ఉన్నాయి. ఇప్పుడామె అంధురాలితో సమానం! ఆ పాప రూపాన్ని మదిలో ఊహించుకుంటూ తన హస్తాలతో పాప శరీరాన్ని నిమురుతూ దాని వెచ్చదనాన్ని అనుభవించసాగింది. కాని, మనసారా చూడలేక పోతున్న బాధకు లోనయింది.

ఉన్నట్లుండి ఆమె ఆలోచనలు తనతో సంభాషిస్తున్న ఆవిడమీదికి మళ్ళాయి. ఆవిడ గొంతుక

దివ్యమూర్తి



ఇందిర గొంతుకలా ఉంది. అనుమానంతో ప్రశ్నించింది:

"ఏమండీ?"

"ఊఁ." జవాబు ఇచ్చిందామె.

"మీరెవరో తెలుసుకోవచ్చా?"

"నర్సుని." మామూలుగా ఉంది ఆమె జవాబు.

ఆ జవాబులో ఇందిర స్వరం స్పష్టంగా వినిపించింది. ఆమెలో తెలియని ఆనందం ప్రవేశించింది.

"మీ పేరేమిటండీ?"

"శోభ." జవాబిచ్చింది నర్సు.

ఆమె జవాబు నిర్మలకు అనుమానంగా ఉంది. గొంతుమాత్రం తప్పకుండా ఇందిరదే! కాని, బి. ఎ. పాసయి నర్సుపని చేయటమే అనుమానం!

"ఏమండీ!" ఈసారి ప్రాధేయపడుతూ పిలిచింది.

"..............."

"ఏమండీ!" కొంచెం బిగ్గరగా పిలిచింది.

ఆమెకు సమాధానంగా లోనికి వస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది.

"ఏం కావాలి!" ప్రశ్నించిందొక కంఠం. ఆమె ముందున్న ఆమె కాదు.

"ఇప్పుడు ఇక్కడ ఉన్న ఆవిడ ఏదండీ?" ఆదుర్దాగా ప్రశ్నించింది నిర్మల.

"వెళ్ళిపోయింది. ఆమెకు ఈ ఊరినుండి మరొక ఊరు బదిలీ అయింది. ఆమె ఇక్కడ ఉండవలసిన గడువు నిన్నటివరకే. కాని, మీరు చాలా ప్రమాదకరమైన స్థితిలో ఇక్కడికి రావటంతో, మీరు స్పృహలోకి వచ్చేంతవరకు, మీ దగ్గిర డ్యూటీచేసేందుకు పై అధికారుల అనుమతి పొందింది. ఆమెలో ఉన్న వాళ్ళను చూస్తే సహించలేదామె. ఆమె నిజంగా దేవత! ఈ క్షణంనుండి ఆమె మరో ఆస్పత్రి పాలయింది." కొంచెం బాధగా అన్నదా నర్సు.

"ఆ దేవత పేరేమిటండీ?" ఆమె బాధ తానూ అనుభవిస్తూ అంది నిర్మల.

"ఇందిర." బొంగురు పోయిన స్వరంతో అంది నర్సు.

నిర్మల ఉలిక్కిపడింది. తను ఇంతవరకూ సేవ చేసింది ఇందిరా? శత్రువైన తనను మనసారా సేవచేసి, కాపాడిన దేవత ఇందిరేనా? నిజంగా ఆమె దేవత! ఆమె జీవితాన్ని నాశనం చేసిన తనకు సేవ చేసిందంటే ఆమె ముమ్మాటికీ దేవతే! తను పాపి! అందుకే తను అంధురాలయింది. ఆఖరికి కన్న కూతురును చూసే అదృష్టం కూడా నశించింది. మిత్రద్రోహానికి సరైన శాపం!

ఆమెలో ఉండి ఉండి దుఃఖం పొంగుకు వస్తోంది. పశ్చాత్తాపం ఆవరించింది.

"ఇందిరా! ఇందిరా!" పొంగుకు వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, చేతులతో పరిసరాలు తడుముతూ బెడ్‌మీదనుండి దిగబోయింది.

"ఆఁ! ఆఁ! దిగకూడదు!" వారించింది నర్సు.

"నన్ను ఇందిర దగ్గిరికి తీసుకెళ్ళండి." బొంగురు పోతున్న గొంతుకతో ప్రతిమిలాడింది నిర్మల.

"ఈపాటికి ఆమె వెళ్ళిపోయి ఉంటుంది."

"ఆఁ! ఇందిరవెళ్ళిపోయిందా? దేవతవెళ్ళిపోయిందా? ద్రోహికి సేవచేసి వెళ్ళిపోయిందా?" క్రమంగా ఆమె గొంతుక దుఃఖంతో పూడుకుపోయింది. ★